క్లుప్తంగా

ప్రభుత్వానికి పీఆర్‌టీయూ మద్దతుగా ఉండాలి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో 80 వేల మంది సభ్యులతో అతిపెద్ద సంఘంగా ఉన్న పీఆర్‌టీయూ సంఘం ప్రభుత్వానికి మద్దతుగా నిలబడాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు. ఆదివారం నగరంలోని పీఆర్‌టీయూ నూతన కార్యాలయంలో ఇటీవల పదోన్నతి పొందిన 50 మందికి పైగా ప్రధానోపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 52 మంది గెజిటెడ్ హెచ్‌ఎంలను శాలువాలు, పుష్పగుచ్ఛం సన్మానించారు. ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సంఘ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మోతుకూరి మధు, ఆర్ రంగారావు, డీఈఓ సోమశేఖర శర్మ, పీఆర్‌టీయు నాయకులు ఫణి కుమార్, నారాయణరెడ్డి, రామ్మోహన్‌రావు, వైవి విజయ్ అమృతకుమార్, హరిత, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సభ్యుడిగా రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్‌ఎఫ్) జాతీయ సమితి సభ్యుడిగా సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ఎన్నికయ్యారు. గత నెల 28 నుంచి బీహార్ రాష్ట్రంలోని బెగుసరైలో జరిగిన జాతీయ మహాసభల్లో జిల్లాకు చెందిన సంఘ ప్రధాన కార్యదర్శిని జాతీయ సమితి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రామకృష్ణ ఎన్నికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రఘునాథపాలెం: రఘునాథపాలెం సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఎ.ఇందిర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రఘునాథపాలెం, కేసీఆర్, కేటీఆర్ కాలనీలు, కోయచలక, రేగుల చలక, ప్రగతిఫైడ్, రఘునాథపాలెంపై కాలనీ, దారేడు, శివాయిగూడెం, పువ్వాడఉదయ్‌నగర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

వడ్డీ చెల్లించి రుణమాఫీ డబ్బు తీసుకోండి..

రఘునాథపాలెం: ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.1లక్ష లోపు రుణాలకు సంబంధించి మండలంలోని వీవీపాలెం సొసైటీ ద్వారా రుణం పొందిన వారి మాఫీ జాబితా వచ్చిందని జాబితాలో పేర్లు చూసుకొని వడ్డీ చెల్లించి మాఫీ పైకం తిరిగిపొందాలని సొసైటీ వైస్ చైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వడ్డీలు చెల్లించి రెన్యువల్ చేసుకోకపోతే వడ్డీ భారం అవుతుందని, ఈనెల 3న సొసైటీలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు సొసైటీ సిబ్బంది అందుబాటులో ఉంటారని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత ఉండి మాఫీలో పేరు రాని వారు వ్యవసాయశాఖ ఏఈఓను కలవాలని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

ఖమ్మంవైద్యవిభాగం: జంగాల రాజేశ్వరరావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మయూరిసెంటర్‌లోని సాయిరాం గ్యాస్ట్రో లివర్ హాస్పిటల్‌లో ప్రముఖ వైద్యులు జంగాల సునీల్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. తమ ఫౌండేషన్ ద్వారా ప్రతీ నెల మొదటి, మూడో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జంగాల శ్రీధర్, స్వాతి తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ గవర్నర్ ఎమ్మెల్సీ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థుల సిఫార్సులను తిరస్కరించినందుకు తెలంగాణ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం జెడ్పీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నాయకులు నరసింహ, వెంకటేశ్వర్లు, వెంకట్, భిక్షం, శ్రీను, మల్లయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

కార్మికులందరికీ గృహలక్ష్మి వర్తింపజేయాలి

ఖమ్మంఅర్బన్: భవన నిర్మాణ రంగంలో ఉన్న కార్మికులందరికీ గృహలక్ష్మి పథకం వర్తింపజేసి రూ.5 లక్షలు అందించాలని తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని బల్లేపల్లిలో మూడవ డివిజన్‌లో భవన నిర్మాణ కార్మికుల ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ... నగరంలో వేలాదిమంది కార్మికులకు ఉపాధికి బైపాస్ రోడ్డు, జెడ్పీ సెంటర్, గాంధీచౌక్ ప్రభాకర్ టాకీస్ సెంటర్లలో షెడ్లు, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని కోరారు. వెల్ఫేర్ బోర్డులో అప్లై చేసుకున్న ప్రతీ కార్మికుడికి సంక్షేమ నిధులు అందజేయాలన్నారు. నాయకులు పుల్లారావు, నారాయణ, ఉపేందర్, చింతల వెంకన్న, మల్లేష్, వీరయ్య, అజయ్ పాల్గొన్నారు.

మోటార్లు.. మాయం!

వరుస చోరీలతో రైతుల బెంబేలు

- ఒక్క నెలలోనే 20 వరకు చోరీ చేసిన దుండగులు
- ఆర్థికంగా నలిగిపోతున్న రైతాంగం
- పోలీసులకు సవాల్‌గా మారిన వైనం
- పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని వేడుకోలు





చెన్నారంలో చోరీకి గురైన మోటార్

ఇటీవల జరుగుతున్న వరుస విద్యుత్ మోటార్ల చోరీలు పోలీసులకు సవాల్‌గా మారాయి. పంట చేతికొచ్చే సమయానికి మోటార్లు ఇలా చోరీకి గురికావడంతో పంటలు ఎండిపోతున్నాయి.ఈనేపథ్యంలోనే రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు గుర్తు తెలియని దుండగులు. మోటార్లు ఒకటి పోతే ఇంకోటి కొనుగోలు చేయటం తప్ప.. రైతులు చేసేదేమీ లేక మధనపడుతున్నారు. ఒక్క నెలలోనే 20 మోటార్లు వరకు చోరీ జరగటంతో రైతులు పొలాల వద్ద జాగారం చేయాల్సి వస్తోంది. పోలీసులు పెట్రోలింగ్ చేయాలంటూ రైతులు వేడుకుంటున్నారు.

నేలకొండపల్లి: మండలంలో ఇటీవల విద్యుత్ మోటార్లను టార్గెట్ చేస్తూ గుర్తు తెలియని దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. అందినకాడికల్లా అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తున్న రైతులకు ఈ వరుస చోరీలు తలనొప్పిగా మారాయి. పంట చేతికొచ్చే సమయానికి మోటార్లు చోరీలకు గురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. గత వారంలో కోరట్లగూడెంకు చెందిన సుంకర వెంకటేశ్వర్లు, గురిజాల విజయమ్మ అనే రైతులకు చెందిన మోటార్లు చోరీకి గురయ్యాయి. అంతేకాక చెన్నారంలోని పాలేరు పాత కాల్వ 25వ తూము వద్ద వజ్జా శ్రీను, వజ్జా మూర్తి, వజ్జా నాగేశ్వరరావులకు చెందిన వ్యవసాయ విద్యుత్ మోటార్లు చోరీ అయ్యాయి. గత నెల 17వ తేదీన రాజేశ్వరపురానికి చెందిన చలవాది రామారావుకు చెందిన మోటార్, బుధవారం చెన్నారానికి చెందిన రాధాకృష్ణమూర్తి, మాధవరావులకు చెందిన మూడు మోటార్లు చోరీకి గురయ్యాయి. తరువాత మంగళవారం మోటాపురంలో ఏలూరి శ్రీనివాసరావుకు చెందిన రెండు, చావా జయలక్ష్మికు చెందిన మరో రెండు, పాల శ్రీనివాసరావుకు చెందిన ఒక మోటార్ చోరీ కాగా.. ఒకే రోజు 5 మోటార్లు పోవడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాజేశ్వరపురంలో ఎండిపోతున్న చెరుకు తోట

సవాల్‌గా మారిన చోరీలు..

మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న వరుస విద్యుత్ మోటార్ల చోరీలు పోలీసులకు సవాల్‌గా మారాయి. గ్రామంల్లో సీసీ కెమెరాలు లేకపోవడం, ఉన్న చోట పని చేయకపోవడంతో దొంగల పని సులువుగా మారుతోంది. ఇది ఇలాగే కొనసాగితే రైతులు వ్యవసాయం చేయడం కష్టంగా మారనుంది. పోలీసులు ఇప్పటికైనా పెట్రోలింగ్ నిర్వహించి దొంగలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పంటలు ఎండిపోతున్నాయి..



విద్యుత్ మోటార్ చోరీకి కావడంతో చెరుకు పంట ఎండిపోతోంది. పంట చేతికందే సమయానికి ఇలా చోరీలకు పాల్పడడంతో ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. ఇంకో మోటార్‌ను కొందామంటే సరిపడా డబ్బులు లేవు. ఇకనైనా పోలీస్ అధికారులు మోటార్లు చోరీలకు గురికాకుండా చూడాలి.
– సీహెచ్.రామారావు, బాధిత రైతు, రాజేశ్వరపురం

భద్రత కల్పించాలి..



వ్యవసాయం కోసం అప్పులు చేసి మరీ మోటార్లను కొనుగోలు చేస్తున్నాం. ఇలా మోటార్లు దొంగలపాలు కావడంతో సాగు కష్టంగా మారుతోంది. మోటార్ చోరీ అయినప్పటి నుంచి పత్తి పంట కూడా ఎండిపోతోంది. మా బాధలకు అర్థం చేసుకొని మోటార్లకు భద్రత కల్పించాలి.
– జి.విజయమ్మ, బాధిత రైతు, కోరట్లగూడెం

ఫిర్యాదులు పట్టించుకోవడం లేదు..



వ్యవసాయ మోటార్లు చోరీకి గురైనప్పుడల్లా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. దొంగలతో కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ఎవరి మోటార్ ఎప్పుడు చోరీకి గురవుతుందోనని ఆందోళన చెందుతున్నాం. పోలీసులు పెట్రోలింగ్ పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
– ఆర్.కృష్ణారావు, బాధిత రైతు, మోటాపురం

అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా..



మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, ఇంకా చేయాల్సింది ఉందని రాష్ట్ర రవాణాశాఖమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని నిర్మల్‌హృదయ్ పాఠశాలలో తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నిర్మల్ హృదయ్ కరస్పాండెంట్ వంగా సాంబశివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సుధాకర్ రెడ్డి, రవి, భారత్‌రెడ్డి, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ దోరేపల్లి శ్వేత, కార్పొరేటర్ శ్రీవిద్య నాగరాజు, బత్తుల మురళీ, ట్రస్మా బాధ్యులు కేసా వీరన్న,అప్పారావు, గొల్లపూడి రామ్ ప్రసాద్, రామచంద్రరావు, సుధాకర్ రెడ్డి, న్యూ విజన్ ప్రసాద్, భాస్కర్, ఆర్‌వీఎస్ యాదవ్, పవన్, కిషోర్, సందీప్, పాల్గొన్నారు.

తాను చదువుకున్న కళాశాల సమ్మేళనంలో..

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ఖమ్మం ఎస్ఆర్ జూనియర్ కళాశాల, శాంతి నగర్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు నిర్వహించిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థి మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ పువ్వాడ కృష్ణ, ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు. పూర్వ విద్యార్థి, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు గిరి, అహ్మద్, కలిక్, రాంబాబు , బస్కి నాయక్, భవాని ప్రసాద్, నాయుడు, చంద్రశేఖర్, శ్రీనివాస్ రావు, వెంకటేశ్వర్లు, గౌస్, పులిపాటి ప్రసాద్, అమంచి సురేష్ పాల్గొన్నారు.

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి, కోటపాడు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శంకుస్థాపనలు చేశారు. ఎంపీపీ గౌరి, జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక, వైస్ ఎంపీపీగుత్తా రవి, సర్పంచ్‌లు గౌరై క్రిష్ణవేణి శ్రీనివాసరావు, బాతుల రమణీ సుధాకర్, కొంటిముక్కల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు మాధంశెట్టి హరిప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దినేని వెంకటరమణ, రైతు బంధుసమితి జిల్లా సభ్యుడు మందడపు సుధాకర్, మండల కన్వీనర్ దొంతు సత్యనారాయణ, తుమ్మలపల్లి మోహన్‌రావు, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ప్రదీప్, సైదులు, రామారావు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మున్నూరుకాపులదే కీలకపాత్ర..



మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు రవిచంద్రలను సత్కరిస్తున్న మున్నూరుకాపు సంఘ బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: రానున్న ఎన్నికల్లో జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు మున్నూరుకాపుల పాత్ర కీలకమని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడుఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. వద్దిరాజుకు సీఎం వద్ద సుస్థిర స్థానం ఉందని, అత్యుత్తమ లోక్‌సభలో 240 మందిలో కాపు బిడ్డ ఉండటం గర్వకారణమన్నారు. వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ... ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ పదికి పది స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవిందర్, సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, మేకల బిక్షమయ్య, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, తోట రామారావు, పాలేపు విజయమ్మ, శీలంశెట్టి రమ, వీరభద్రం, పొన్నం వెంకటేశ్వరరావు, రాపర్తి శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలేరులో వార్ వన్ సైడే..



నేలకొండపల్లి: గోడౌన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

నేలకొండపల్లి: రానున్న ఎన్నికలలో పాలేరు లో వార్ వన్‌సైడేనని, బీఆర్‌ఎస్ భారీ మెజార్టీతో గెలుస్తుందని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పైనంపల్లి, నాచేపల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సొసైటీ గోడౌన్లను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పైనంపల్లిలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో 13 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. మంగాపురంతండాలో మేరమ్మ తల్లి, సేవాలాల్ మహారాజ్ దేవాలయాలను సందర్శించి విరాళాలు అందించారు. రాయగూడెం, కోరట్లగూడెం గ్రామాల్లో పలు కుటుంబాలు పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. గువ్వలగూడెంలో దేవాలయాలకు విరాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు కురాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, ఎంపీపీ వజ్జా రమ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కూసుమంచి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఎంపీపీ మంగీలాల్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వీరన్న పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధం



ఖమ్మంరూరల్: వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్/ నేలకొండపల్లి: బీఆర్‌ఎస్ పాలకులను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, పక్కగా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే తెలంగాణలో విజయం సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండల్లాలోని గ్రామాల్లో పర్యటించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇవ్వలేదని, డబుల్‌బెడ్ రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదని, మళ్లీ అవే మభ్యపు హామీలతో మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ కొడతామని కళలుగంటున్న బీఆర్‌ఎస్ పాలకుల కళలు కళలుగానే మిగిలిపోవడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, నెల్లూరి భద్రయ్య, చెరువు స్వర్ణ, చిట్యాల రమేష్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

ఖమ్మంరాపర్తినగర్: ఖమ్మం జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లమోతు తిరుమలరావు రాష్ట్ర ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలో ఆప్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుమలరావు మాట్లాడుతూ... పల్లెలు, పట్టణాల్లో ప్రతీ ఇంటా విషజ్వరాలు సోకి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటింటికి వెళ్లి జ్వరాల సర్వేచేసి రక్తనమూనాలు సేకరించి ఉచిత వైద్య పరీక్షలు చేయాలన్నారు.

ఆర్థికసాయం

నేలకొండపల్లి: ప్రతీ ఒక్కరి మొహంలో చిరునవ్వే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పార్టీ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను ఆదివారం పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 70 స్థానాలకు పైగా సీట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమాల్లో దూసుకెళ్లటం ఖాయమన్నారు. నెల్లూరి భద్రయ్య, చెరువు స్వర్ణ, కొడాలి గోవిందరావు, లక్కం ఏడుకొండలు, చిదుముల జానారెడ్డి, చిలకల సీతారావమ్మ, యడవల్లి హుస్సేన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవచేయడమే లక్ష్యం..

పేదలకు సేవ చేయడమే సీపీఎం లక్ష్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా.నాగేశ్వరరావు అన్నారు. వరంగల్‌క్రాస్‌రోడ్డులో సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యులు డాక్టర్ భారవి, పి.సుబ్బారావు, నాయకులు వి. సుదర్శన్‌రెడ్డి, నంద్రప్రసాద్, పొన్నం వెంకటరమణ, తోట నరేష్‌రెడ్డి, మల్లయ్య, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా పథకాలు అమలు చేయాలి

ఖమ్మంరూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి, దళితబంధు పథకాలను రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండి రమేష్ అన్నారు. మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దళితుల, బీసీల సంక్షేమానికి చేపట్టిన పథకాల్లో పక్షపాత వైఖరి ఉండకూడదని, తెలంగాణలో మరోసారి గ్రూపు1 పరీక్ష రద్దు చేయడం హేయమైన చర్య అన్నారు.

మోసపూరిత మాటలు నమ్మొద్దు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో ఎన్నికల జాతర మొదలైందని, రాజకీయ పార్టీల నేతలు ప్రజలను మోసం చేసేందుకు పథకాలను ఊదరగొడుతున్నారని, వారి మాటలు విని మోసపోవద్దని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహమద్ సలాం అన్నారు. ఆదివారం నగరంలో జాల నరసింహరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీపీఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు మభ్యపెట్టే చర్యలకు పూనుకున్నారన్నారు. గతంలో పట్టాలు ఇచ్చిన స్థలాలకు కూడా ఇప్పుడు 59 జీవో ద్వారా డబ్బులు కట్టాలని రెవెన్యూ అధికారులు పేదలను హింసిస్తున్నారన్నారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, బోడ వీరన్న, ఎండి.రహమాన్, శేఖర్, ఎస్‌కె.చానా, వి.రమణ పాల్గొన్నారు.

సీనియర్ ఓటర్లకు సన్మానం



తిరుమలాయపాలెం: సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్ రామ్‌ప్రసాద్



ఖమ్మంరూరల్: పాఠశాలలో సన్మానం..

తిరుమలాయపాలెం: కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం తిరుమలాయపాలెం జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో 80 ఏళ్లకు పైబడిన ఓటర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ... సీనియర్ సిటిజన్లకు పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ స్టేషన్ల సౌకర్యాల గురించి వివరించి ఓటు హక్కుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారావు, ఎలక్షన్ సూపర్‌వైజర్ లక్ష్మణ్, బీఎల్ఓలు గీత, శ్రీనివాసరావు ఓటర్లు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: మండలంలోని గోళ్లపాడు, పోలేపల్లి ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజన్లను తహసీల్దార్ బీవీ.రామకృష్ణ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలు, పోలింగ్‌స్టేషన్లలో సీనియర్ సిటిజన్లకు సౌకర్యాల గురించి వివరించారు. ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత' మౌలిక సూత్రంగా మారాలి

ప్రతీ ఒక్కరి జీవన విధానంలో స్వచ్ఛత ఒక మౌలిక సూత్రంగా మారాలని పలువురు అన్నారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, కళాశాలలు, వీధుల్లో చెత్తాచెదారం తొలగించి శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు.
– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రధానాస్పత్రిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం..



ఖమ్మంగాంధీచౌక్: ఖిల్లాపై శ్రమదానం చేస్తున్న తపాలా ఉద్యోగులు



ఖమ్మం మామిళ్లగూడెం: కొత్త బస్టాండ్‌లో..



ఖమ్మంమయూరిసెంటర్: 23వ డివిజన్‌లో..



ఖమ్మంఅర్బన్: బొమ్మ కాలేజీలో..



ఖమ్మం స్పోర్ట్స్: ఎన్‌సీసీ క్యాడెట్స్ ఆధ్వర్యంలో..



ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని జూబ్లీపుర ఎస్‌బీఐ బ్రాంచిలో..



నేలకొండపల్లి: కొత్తకొత్తూరులో..



కూసుమంచిలో..



ఖమ్మం రైల్వే స్టేషన్‌లో..